యశస్విని ఆదర్శంగా తీసుకోవాలి : కలెక్టర్

భీమవరం : పాలిటెక్నిక్ కోర్స్ ఎంపికలో యశస్విని ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణి కాళ్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో చదివి పది పరీక్షల్లో 586 మార్కులు సాధించిన నిమ్మల యశస్విని ప్రత్యేకంగా అభినందించారు. ఏం చదవాలి అనుకుంటున్నావు అని జిల్లా కలెక్టర్ ప్రశ్నించిన సందర్భంలో తాను పాలిసెట్ ఎంట్రన్స్ టెస్ట్ రాస్తున్నానని, పాలిటెక్నిక్ చదవాలనుకుంటున్నానని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ పాలిటెక్నిక్, ఐటిఐ కోర్సులు పూర్తి చేసుకున్న వెంటనే ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని, మంచి నిర్ణయం తీసుకున్నావని అభినందించారు. టెన్త్ క్లాస్ ఉత్తీర్ణత చెందిన విద్యార్థులు కోర్సుల ఎంపికలో యశస్విని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించినందుకు ప్రధానోపాధ్యాయు జెడ్‌పిఎం శాస్త్రికి జిల్లా కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో డిఇఒ ఇ.నారాయణ, ఎంఇఒ ఎ.రవీంద్ర, ప్రధానోపాధ్యాయులు జెడ్‌పిఎం.శాస్త్రి, యశస్విని తల్లిదండ్రులు నిమ్మల శ్రీనివాసరావు, భారతి పాల్గొన్నారు.

ఆకివీడులో నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

కాళ్లలో..

తణుకులో..

రఘురామా.. ఇదేం భాష.. అదేం తీరు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై ఉండి ఎంఎల్ఎ వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసనల వెల్లువ

పెనుగొండలో..

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన జిల్లా వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. రఘురామకృష్ణరాజు తీరు మార్చుకోవాలని, పేదలకు న్యాయం చేయాలని నినదించారు. కమ్యూనిస్టులను బెదిరిస్తే బెదిరిపోయే రకం కాదని స్పష్టం చేశారు.

పెనుమంట్రలో..

ప్రజాశక్తి - వీరవాసరం

ఎంఎల్ఎ రఘు రామకృష్ణరాజు తీరును నిరసిస్తూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యాన స్థానిక బస్టాండ్ సెంటర్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడారు. చేసిన తప్పును ప్రశ్నిస్తే తట్టుకోలేని స్థితిలో రఘురామకృష్ణరాజు ఉన్నారన్నారు. పేదలకు న్యాయం జరిగే వరకూ పోరాటమే కమ్యూనిస్టుల నైజం అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొర్రా ఆలమహరాజు, అయినంపూడి బాబూరావు, యాళ్లబండి మారియ్యానాయుడు, పోతుల మృత్యుంజయ, నారాయణమూర్తి, యండమూరి సుబ్బారావు, కిలాడి సత్యనారాయణ, లింగం సత్యనారాయణ, జుత్తిగ శ్రీనివాస్, గొట్టుముక్కల శ్యాంబాబు, కుడిపూడి పెద్దిరాజు పాల్గొన్నారు.

గణపవరం : సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మల్లపురాజుపేట సెంటర్లో దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి పెచ్చేట్టి నరశింహమూర్తి, నాయకులు పెంటారావు, నాగేశ్వరరావు, రామకృష్ణ, సంజీవిరావు మాట్లాడారు. శ్రీనివాసరావుపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పెనుమంట్ర: బ్రాహ్మణచెరువు సెంటర్‌లో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, పేదలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి శ్రీనివాస ప్రసాద్, మండల కమిటీ సభ్యులు కుసంపూడి సుబ్బరాజు మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శిపై ఆయన వాడిన భాష సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యురాలు, ఐద్వా జిల్లా అధ్యక్షులు కేతా పద్మజ, సభ్యులు రాపాక ఆశీర్వాదం, తానేటి ఆంజనేయులు, చింతపల్లి అప్పారావు, ఎం.లక్ష్మణరావు, జోగి శ్రీను, కె.ప్రమోద్ పాల్గొన్నారు.

ఉండి : ఉండి మెయిన్ సెంటర్లో సిపిఎం మండల కార్యదర్శి చీర్ల శేషు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు ధనికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీనివాసరావుకు రఘు రామకృష్ణరాజు క్షమాపణలు చెప్పి వ్యాఖ్యలను ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు వీరవల్లి మాధవరావు, కె.వెంకటేశ్వరరావు, రామకూరి వెంకటరత్నం, చీర్ల శ్రీనివాస్, చిట్టి అన్నవరం, మోపీదేవి రాము, పెళ్లూరి సుబ్రహ్మణ్యం, కడలి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు : డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణరాజును భర్తరఫ్ చేసి చర్యలు తీసుకోవాలని సిపిఎం మాజీ ఎంఎల్ఏ దిగుపాటి రాజగోపాల్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీ బొమ్మల సెంటర్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంఎల్ఏ రాక్షస పాలన చేస్తున్నారని విమర్శించారు. రఘురామకృష్ణరాజుపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జవ్వాది శ్రీనివాసరావు, చల్లా సోమేశ్వరరావు, వై.అజయ్‌కుమార్, టి.గంగరాజు, యాకల్ రాము, ఎస్.పురుషోత్తం, గుబ్బల సత్యనారాయణ పాల్గొన్నారు.

పాలకొల్లులో..

తణుకు : డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణరాజు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్, పట్టణ కార్యదర్శి అడ్డగర్ల అజయకుమారి డిమాండ్ చేశారు. నరేంద్ర కూడలిలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్, అజయకుమారి మాట్లాడారు. శ్రీనివాసరావు విద్యార్థి దశ నుండి నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేస్తున్నారన్నారు. పదవులు లేకపోతే బయట అడుగు పెట్టలేని రఘురామ ఎక్కడ, పేదలకు అండగా నిలబడే శ్రీనివాసరావు ఎక్కడ అని ప్రశ్నించారు. పేదల ఇళ్ల కూల్చివేతలు ఆపాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గార రంగారావు, గుబ్బల గోపి, బళ్ల చిన వీరభద్రం, నాగరత్నం, అంబటి రామకృష్ణ, నర్సింహారావు, వల్లూరి వెంకటేశ్వరరావు, జి.అచ్చియ్య, చిన్నారావు, శ్రీనివాస్, ఎన్.రామారావు, భాస్కరరావు పాల్గొన్నారు.

ఆకివీడు : గాంధీ బొమ్మ సెంటర్లో సిపిఎం నిరసన తెలిపింది. ఈ సందర్భంగా సిపిఎం ఏరియా కార్యదర్శి కె.తవిటి నాయుడు, నాయకులు పెంకి అప్పారావు మాట్లాడారు. డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణరాజు తీరు మార్చుకోకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో షేక్ వలీ, డి.రవితేజ, ఎస్.ఉదయకుమారి, సందక సూరిబాబు, బివి.వర్మ, బి.రాంబాబు, కళ్యాణి, కిసింజర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

యలమంచిలి: చించినాడ జాతీయ రహదారిపై సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడుతూ శ్రీనివాసరావుపై రఘు రామకృష్ణ రాజు నోటికొచ్చినట్లు దుర్భాషలాడుతూ అహంకారాన్ని ప్రదర్శించారని, ఆయన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దేవ సుధాకర్, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, అంబటి రంగనాయకులు, గుబ్బల చక్రపాణి, గుడూరి ఆంజనేయులు, స్థాలిన్, భాస్కరరావు, ఆంజనేయులు, మల్లుల కోటి, జోషప్‌రాజ్, ఆనందరాజు, పద్మారాజ్, జయశ్రీ, మణి పాల్గొన్నారు.

ఆచంట : భూస్వాముల ఆధీనంలో ఉన్న భూములను వదిలేసి నిరుపేద ఇళ్లను కూల్చడం దుర్మార్గపు చర్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. రఘు రామకృష్ణరాజు తీరును నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో కచేరీ సెంటర్లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు పట్ల డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణరాజు స్పందించిన తీరు దారుణమన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు, మండల కమిటీ సభ్యులు తలుపూరి బుల్లబ్బాయి, ఎస్‌విఎన్.శర్మ, సిర్రా నరసింహమూర్తి, కుసుమే జయరాజు, సీనియర్ నాయకులు బండి రంగారావు, తోటపల్లి సత్యనారాయణ, సిర్రా విఘ్నేశ్వరుడు, రొక్కాల దేవదానం, చంటిబాబు, మోసేన్ పాల్గొన్నారు.

పెనుగొండ : గోంగూర తూము సెంటర్లో సిపిఎం శ్రేణులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఇప్పటికైనా ఎంఎల్ఏ రఘురామకృష్ణరాజు, శ్రీనివారావుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగిశెట్టి గంగారావు, కప్పల రత్నరాజు, నీలాపు ఆదినారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకోడేరు : డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణరాజు వ్యాఖ్యలకు నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి అశ్రియ మాట్లాడారు. కార్యక్రమంలో దున్న మరియమ్మ, మల్లుల వెంకటేశ్వరరావు, మెట్ట రామారావు పాల్గొన్నారు.

ఇరగవరం : డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణరాజు రాజీనామా చేయాలని సిపిఎం మండల కన్వీనర్ కామన మునిస్వామి డిమాండ్ చేశారు. మండలంలో సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. మునిస్వామి మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావును అసభ్య పదజాలంతో మాట్లాడడం ప్రజాప్రతినిధిగా తగదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సభ్యులు జక్కంశెట్టి గంగాధరరావు, గుబ్బల ముత్యాలు, పెచ్చేటి సుబ్బారావు, జుత్తుగ రామాంజనేయులు పాల్గొన్నారు.

కాళ్ల : రఘు రామకృష్ణరాజు పేదలపై దమన్న కాండను ఆపాలని సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ అన్నారు. స్థానియ రామాలయం సెంటర్లో సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శిని విమర్శించే స్థాయి రఘు రామకృష్ణరాజుకు లేదన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు తిరుమల శ్రీను, మండా సూరిబాబు, తానుకొండ వెంకటేశ్వరరావు, దాసి బాలయ్య, గండికోట వెంకటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : వెంప బస్‌స్టాండ్ సెంటర్లో సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో చిలకపాటి ఆనంద్ భూపతి శామేలు కాటికి సంపత్‌రావు వర్ధనపు నరసింహులు, బొబ్బనపల్లి రాజు, శ్రీను పాల్గొన్నారు.

పాలకోడేరులో..

ఉండిలో..

వీరవాసరంలో..

ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలపై దృష్టి సారించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు, ప్రభుత్వ పాఠశాలల విద్యాబోధనపై ఇంటింటా ప్రచారం ద్వారా తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పదో తరగతి పరీక్షా ఫలితాలు, ప్రభుత్వ పాఠశాలలో చేరికలు, అల్పదాయ వర్గాల పిల్లలకు 25 శాతం సీట్ల కేటాయింపు, బడి బయట పిల్లలు చేరికలు, ఆపార్ ఐడి నమోదు అంశాలపై విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్య ఎందుకు మేటిగా నిలుస్తోందో ప్రతి ఒక్కరికీ తెలియజెప్పాలన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లా 82.15 శాతం నమోదు చేసుకుని రాష్ట్రంలో 16వ స్థానంలో నిలిచిందన్నారు. జిల్లాలో మొత్తం 21,539 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరుకాగా వారిలో మగ పిల్లలు 10,924 మందికి గాను 8,612 మంది ఉత్తీర్ణత సాధించి 78.84 శాతం నమోదు చేశారన్నారు. విద్యార్థినులు 10,615 మందికి గాను 9,083 మంది ఉత్తీర్ణత చెంది 85.57 శాతాన్ని నమోదు చేయడం జరిగిందన్నారు. పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు మే 19 నుండి 28వ తేదీ వరకూ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వీరికి ప్రత్యేక క్లాసులు నిర్వహించాలని డిఇఒను ఆదేశించారు. అల్పదాయ వర్గాల పిల్లలకు ప్రయివేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం కోటా సీట్ల భర్తీకి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ నెల 28 నుండి మే 15 వరకూ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 25 శాతం సీట్ల భర్తీ సమయంలో సింగిల్ పేరెంట్ చిల్డ్రన్, తల్లిదండ్రులు లేని పిల్లలకు ప్రాధాన్యతివ్వాలని సూచించారు. పిల్లలు బడి బయట ఎట్టి పరిస్థితుల్లో ఉండరాదని, ముఖ్యంగా 6, 7, 8 తరగతుల్లో డ్రాప్ ఔట్స్ ఎక్కువగా ఉంటున్నాయని, వాటిని నిరోధించడానికి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఇఒ ఇ.నారాయణ, సమగ్ర శిక్ష ఎపిసి పి.శ్యాంసుందర్, జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారి వై.దోసిరెడ్డి, డిప్యూటీ ఇఒలు, డిఇఒ కార్యాలయ ఎడి ఎన్.సత్యనారాయణ, ఎంఇఒలు, పాల్గొన్నారు.

27 నుంచి కాలువలు మూసివేత

కాలువల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం - ఇరిగేషన్ ఎస్ఇ నాగార్జునరావు



మాట్లాడుతున్న ఇరిగేషన్ ఎస్ఇ నాగార్జునరావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఈ నెల 27వ తేదీ నుంచి కాలువలు మూసి వేయనున్నట్లు ఏలూరు ఇరిగేషన్ శాఖ ఎస్ఇ నాగార్జునరావు తెలిపారు. శుక్రవారం స్థానిక ఇరిగేషన్ గెస్ట్ హౌస్‌లో డెల్టా ప్రాజెక్టు కమిటీ కె.ఛైర్మన్ మురళీకృష్ణంరాజు అధ్యక్షతన ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖ అధికారులు, నీటి సంఘం నాయకులతో ప్రాజెక్ట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న కాలువలు మూసివేయాల్సి ఉండగా, దాన్ని ఈనెల 27వ తేదీ వరకూ పొడిగించినట్లు తెలిపారు. కాలువలు, డ్రెయినేజీల ప్రక్షాళనకు ప్రతి నియోజకవర్గానికీ రూ.2 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కాలువలో గుర్రపుడెక్క, తూడు వంటి వాటిని తొలగించడంతోపాటు, గట్ల పటిష్ట పనులు చేపడతామన్నారు. ఈ పనులు ఆ కాలువ పరిధిలోని నీటి సంఘం ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. అలాగే కాల్వ వల్లపై పనిచేసే లస్కర్లకు ప్రభుత్వం ఏడాదికి పది నెలలే జీతాలు చెల్లిస్తుందని, అయితే ఈ ఏడాది నుంచి తమకు 12 నెలలు జీతాలు చెల్లించాలని లస్కర్లు కోరినట్లు, దానిపై చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు ఇఇ సుబ్రహ్మణ్యేశ్వరరావు, భీమవరం డ్రెయినేజీ సిహెచ్ వివి.సత్యనారాయణమూర్తి, ప్రాజెక్టు వైస్ ఛైర్మన్ జి.మార్రాజు, ఇరిగేషన్ డిఇలు డ్రెయినేజీలు డిఇలు, ఎఇ పాల్గొన్నారు.

సుబ్బరాజుచెరువు వాసులకు ప్రత్యామ్నాయం చూపాలి

కలెక్టర్ నాగరాణికి సిపిఎం నేతల వినతి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - భీమవరం

మోగల్లు సుబ్బరాజు చెరువు వాసులలు ఎన్నో ఏళ్ల నుంచి ఇక్కడే నివాసం ఉంటున్నారని, అర్ధాంతరంగా ఇళ్లు తొలగిస్తామని చెబితే ఎక్కడికి వెళ్తారని, తక్షణం ప్రత్యామ్నాయం చూపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ కోరారు. కలెక్టరేట్లో కలెక్టర్ చదలవాడ నాగరాణికి సుబ్బరాజు చెరువువాసులు, సిపిఎం నేతలు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేసి స్థానికంగా ఏర్పడిన ఇల్లు సమస్యలను కలెక్టర్ దష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ సుబ్బరాజుచెరువు ప్రాంతంలో 23 కుటుంబాల వారు ఎన్నో ఏళ్ల నుంచి ఈ స్థలాన్ని నమ్ముకుని ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారని చెప్పారు. నోటీసులిచ్చి ఇళ్లు తొలగిస్తామని చెబితే వారు ఎక్కడికి వెళ్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయం చూపాలని, లేకపోతే బాధితులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్లు అన్యాయంగా తొలగిస్తున్నారని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వినతి అందించిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి శేషాపు అశ్రియ, దున్న మరియమ్మ, వెంకటేశ్వరరావు, రామారావు, సత్యవతి, లక్ష్మి ఉన్నారు.

చదువు'కొన'లేం..!

ఒకటి నుంచి పదిలోపు ఏడాదికి రూ.20 వేల నుంచి రూ. లక్ష ఖర్చు

ఇంటర్ డేస్కాలర్ విద్యకు రూ.60 వేలు పెట్టాల్సిందే

ఇంజినీరింగ్‌కు ఏడాదికి రూ.లక్షన్నర నుంచి రూ.4 లక్షల భారం

బెంబేలెత్తిపోతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం

సామాన్య, మధ్యతరగతి ప్రజానీకానికి చదువు అందనంత ఎత్తుకు ఎగబాకింది. పోటీ ప్రపంచంలో ప్రతిభ కనబరచాలంటే చదువులో ఆది నుంచి గట్టి పునాది ఉంటే తప్ప సాధ్యం కాని పరిస్థితి. ప్రభుత్వ విద్యను బలహీనపరిచి, ప్రయివేటు విద్యకు పాలకులు పెద్దపీట వేస్తుండటంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు తమ పిల్లల చదువు కోసం అప్పల పాలై రోడ్డున పడుతున్న పరిస్థితి ఉంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వెయ్యికిపైగా ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లు ఉన్నాయి. వీటిలో రెండు లక్షల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. చిన్నపాటి ప్రయివేటు స్కూల్‌లో సైతం ఎల్‌కెజి, యుకెజి చదువులకు ఫీజులు, పుస్తకాలు, ఇతర ఖర్చుల పేరుతో రూ.పది వేల వరకూ వసూలు చేస్తున్నారు. ఓ మోస్తరు స్కూల్ అయితే రూ.20 వేలు కట్టాల్సిందే. కార్పొరేట్ స్కూల్ అయితే రూ.30 వేలు పైమాటే. ఒకటో తరగతి నుంచి పదో తరగతిలోపు చదువుకు ప్రయివేటులో రూ.20 వేల నుంచి రూ.లక్ష ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉంది. పుస్తకాలు, బెల్టులు, బూట్లు, అన్నీ ఆయా స్కూళ్లలో కొనుగోలు చేయాలనే నిబంధనలు విధించి దోపిడీ సాగిస్తున్నారు. ఏలూరు జిల్లాలో ప్రయివేటు ఇంటర్ కాలేజీలు 81 వరకూ ఉన్నాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 27 వేల మందికిపైగా విద్యార్థులు ప్రయివేటులో విద్య అభ్యసిస్తున్నారు. పశ్చిమలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇంటర్ హాస్టల్ విద్యకు శశి, తిరుమల, నారాయణ, శ్రీచైతన్య వంటి కాలేజీల్లో రూ.రెండు లక్షల నుంచి రూ.రెండున్నర లక్షలకుపైగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇంటర్ డేస్కాలర్‌కు సైతం బస్సు ఫీజులతో కలిసి రూ.60 వేలు చెల్లించక తప్పదు. దీంతో పిల్లల చదువు కోసం తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. అప్పులు చేసి పిల్లలను చదివిస్తున్న తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలు కోకొల్లలుగా ఉన్నాయి. ప్రభుత్వ విద్యలో సరైన సదుపాయాలు లేకపోవడం, ప్రస్తుత పోటీని తట్టుకునే విధంగా విద్యావిధానం లేకపోవడంతో తమ పిల్లలు ఎక్కడ వెనుకబడిపోతారోనన్న భయం తల్లిదండ్రులను వెంటాడుతోంది. దీంతో తలకు మించి భారమైనప్పటికీ ప్రయివేటు వైపు మొగ్గుచూపుతున్నారు. ఇదే అదునుగా ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యాలు రెచ్చిపోతున్నాయి. ఫీజులకు సంబంధించిన వివరాల పట్టికలు వంటివి డిస్‌ప్లే చేయాల్సి ఉన్నప్పటికీ చేయడం లేదు. టీవీలు, పత్రికల్లో ప్రచారం చేస్తున్నదానికి, వాస్తవ పరిస్థితికి సంబంధం లేకుండాపోతుంది. ప్రయివేటు స్కూళ్లపై ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడంతో ఇష్టానుసారంగా యాజమాన్యాలు రెచ్చిపోతున్న పరిస్థితి ఉంది. ప్రయివేటు స్కూల్స్, కళాశాలల ఫీజులపై ప్రభుత్వం ప్రత్యేక నిబంధనలు విధించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పెనుభారంగా ఇంజినీరింగ్ విద్య

స్కూల్, ఇంటర్ విద్యతోపాటు, ఇంజనీరింగ్ విద్య మరింత పెనుభారంగా తల్లిదండ్రులకు మారింది. సాధారణ డిగ్రీలు చదివితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తక్కువగా ఉండటంతో అంతా ఇంజినీరింగ్, వైద్య విద్య కోర్సుల వైపే ఎక్కువగా విద్యార్థులు మొగ్గుచూపుతున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో జెఎన్‌టియు, ఆంధ్రా యూనివర్సిటీ వంటి ఇంజినీరింగ్ కళాశాలలు మాత్రమే ఉన్నాయి. ఇక్కడ ఉండే సీట్లు అతి స్వల్పంగా ఉన్నాయి. దీంతో ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీలు, ప్రయివేటు యూనివర్సిటీలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ఎంసెట్‌లో ర్యాంకు తెచ్చుకుంటే ఫీజు రీయంబర్స్‌మెంట్ వర్తించినప్పటికీ ఏడాదికి కాలేజీని బట్టి హాస్టల్ ఫీజు రూ.80 వేల నుంచి రూ.లక్షా 50 వేలు, ఇతర ఖర్చుల కింద మరో రూ.50 వేలు మొత్తం రూ లక్షన్నర నుంచి రూ.రెండు లక్షలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇక ఫీజు రీయంబర్స్‌మెంట్ వర్తించకపోతే మరో రూ.లక్షకుపైగా అదనంగా కట్టాల్సిందే. విట్, ఎస్ఎంఆర్, కెఎల్‌యు వంటి యూనివర్సిటీలతోపాటు, వివిధ రాష్ట్రాల్లో ఉన్న యూనివర్సిటీల్లో చేరితే ట్యూషన్ ఫీజు కింద రూ.రెండున్నర లక్షలు, హాస్టల్ ఫీజు కింద రూ.లక్షా 40 వేల నుంచి రూ.రెండులక్షల వరకూ వసూలు చేస్తున్నారు. నాలుగేళ్ల ఇంజినీరింగ్ విద్య పూర్తయ్యేసరికి విద్యార్థికి అయ్యే ఖర్చు రూ.16 లక్షల నుంచి రూ.20 లక్షలు వరకూ అవుతోంది. ఈ భారం సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం మోయలేని పరిస్థితి నెలకొంది. విద్య వ్యాపారంగా మారడంతో సామాన్య విద్యార్థుల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. ప్రభుత్వాలు మాత్రం నాణ్యమైన ప్రాథమిక, ఉన్నత విద్యను అందించడంలో పూర్తిగా విఫలమైన పరిస్థితి ఉంది. దీంతో చదువు'కొన'లేం బాబోయ్ అంటూ జనం అదిరిపడుతున్న పరిస్థితి కన్పిస్తోంది.

నేడు ఎఎస్ఆర్ నగర్‌లో హైకోర్టు లాయర్ల బృందం పర్యటన

ప్రజాశక్తి - పాలకోడేరు

ఈ నెల 26న పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్‌లో హైకోర్టు లాయర్ల బృందం పర్యటించనున్నట్లు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర గౌరవాధ్యక్షులు దిగుపాటి రాజగోపాల్, జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కాలంలో ఉండి నియోజకవర్గం పాలకోడేరు మండలంలో పేదల ఇళ్లను అక్రమంగా కూల్చివేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని తెలిపారు. పౌర హక్కులకు భంగం వాటిల్లేలా హైకోర్టు ఆదేశాలను పక్కనపెట్టి అధికారులు నిరంకుశత్వంగా వ్యవహరించారని తెలిపారు. పేదల ఇళ్లను కూల్చివేయడానికి గల కారణాలను నిజనిర్ధారణకు విజయవాడ నుంచి హైకోర్టులో పేరొందిన లాయర్ల బృందం వస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎఎస్ఆర్ నగర్‌కు చేరుకుని బాధితుల సమస్యలను తెలుసుకోనున్నారు. ఈ క్రమంలో ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.మాధవరావు, ఐలు రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఏ దిగుపాటి రాజగోపాల్, రాష్ట్ర నాయకులు సంపర శ్రీనివాసరావు, ఎస్.రమేష్, కె.రమేష్, కామన మునిస్వామి, పివిపి.లక్ష్మి, ఎస్.మణికంఠ పర్యటించి బాధితులతో మాట్లాడనున్నారని తెలిపారు.

నిధిశ్రీకి అభినందనలు

భీమవరం : ఇటీవల పది పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్, జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించిన బండారు నిధిశ్రీని పలువురు అభినందనలను తెలియజేస్తున్నారు. నిధిశ్రీ తండ్రి కార్తిక్ దామోదర్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన ఏ పాఠశాలలో పని చేస్తున్నారో అదే పాఠశాలలో నిధిశ్రీ చేరి తొమ్మిదో తరగతి వరకు విద్యనభ్యసిస్తూ వచ్చింది. చివరిలో పదవ తరగతి మాత్రం భీమవరం శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో చదివి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించింది. తన లక్ష్యం ఐఐటి అంటూ ఆమె తెలిపింది. ఈ సందర్భంగా నిధిశ్రీని భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు, ఉపాధ్యాయుడు బాజింక్ కృష్ణారావు, గ్రామ పెద్దలు అభినందనలను తెలియజేశారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ

కాళ్ల : కాళ్లకూరు గ్రామంలో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు శుక్రవారం ప్రారంభించారు. కాళ్లకూరు గ్రామంలో 27 మంది పేద ప్రజలకు రూ.81 వేల విలువైన నిత్యవసర సరుకులు, కెల్లా సూరమ్మ ఆరోగ్య పరిస్థితి కోసం రూ.5 వేల విలువైన చెక్కును, మృతుని కుటుంబానికి రూ.5 వేల చెక్కును ఎంఎల్‌ఎ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం రూ.70 వేలతో నిర్మించిన విశ్రాంతి షెడ్డును ఎంఎల్‌ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా దాట్ల వెంకట రామరాజు మాట్లాడుతూ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.50 వేల చెక్కును కాళ్ల ఎస్ఐ శ్రీనివాసరావుకు అందజేస్తున్నారు. ఎస్‌సి పోస్ట్ మాజీ సైనిక్ కాలనీ గ్రామంలో మైక్రో ఫిల్టర్ వాటర్ ప్లాంట్‌ను ఎంఎల్‌ఎ ప్రారంభోత్సవం చేశారు. **మొగల్తూరు :** వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ అన్నారు. మండలకేంద్రం మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో బస్టాండ్ వద్ద శుక్రవారం కాయగూరల వ్యాపారి ముక్కు అంజనేయులు జ్ఞాపకార్థం కుమారుడు ఓం నాగేశ్వరరావు ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రతి ఒక్కరూ చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. పెంకె రామకృష్ణ, ముక్కు గోపాలకృష్ణ, పుల్లయ్య, కావూరి చిన్నబాబు, దేశంశెట్టి శ్రీను, కారుమూరి ప్రభాకర్‌రావు, దొంగ రామారావు, దుసనపూడి రాజు ఉన్నారు.

ఎంపిడిఒ కార్యాలయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

పాలకొల్లు రూరల్ : పాలకొల్లు ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో పెద్ద ప్రమాదం తప్పింది. ఇఒపిఆర్‌డి కార్యాలయంలో విద్యుత్ మీటర్ వద్ద లోడ్ ఎక్కువ కావడంతో షార్ట్ సర్క్యూట్ అయింది. దీంతో ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు సారధ్యంలో సిబ్బంది అప్రమత్తమై విద్యుత్ శాఖ సిబ్బంది సహకారంతో విద్యుత్ సప్లై నిలిపివేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది కూడా వచ్చి ప్రమాదం విస్తరించకుండా చర్యలు తీసుకున్నారు.

అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో విజన్ 2047

ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం : రాష్ట్ర ప్రగతికి అధికారులు, ప్రజల భాగస్వామ్యంతోనే అనుకున్న లక్ష్యం నెరవేరుతుందని ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి అధికారులతో ఆయన విజన్ 2047పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ అందరికీ మౌలిక వసతుల కల్పనతో పాటు సంక్షేమ ఫలాలు అన్ని వర్గాలకు అందించే విధంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఈ లక్ష్యాలను సాధించేందుకు అధికారులు, ప్రజలు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కతిల్ కౌసర్ భాను, డివిజిఒ ప్రభాకర్, తహశీల్దార్ ఎం.సునీల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, పెంటపాడు మండల అధికారులు, తహశీల్దార్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గుంపర్రులో ప్రకృతి వ్యవసాయ వార్షిక ప్రణాళిక

యలమంచిలి : మండలంలోని గుంపర్రు గ్రామంలో కెపిఐ 2025-26 ప్రణాళిక కింద గ్రామస్థాయి ప్రకృతి వ్యవసాయ ప్రచార కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఏపిఎం ఎస్.సుజాత, కెపిఐ ముఖ్య ఉద్దేశం, లక్ష్యాలు గురించి వివరించారు. నవధాన్యాలు 5 రకాల జాతులు ఉంటాయని పప్పుజాతి, పచ్చిరొట్ట, చిరు ధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, కూరగాయలు ఉంటాయని, 14 రకాల నవధాన్యాలు ఉంటాయని వివరించారు. మండల వ్యవసాయాధికారి సిహెచ్.దేవి సభను ఉద్దేశించి మాట్లాడుతూ నవధాన్యాల గురించి ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ గురించి వివరించారు. అనంతరం గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు జెవిని.సత్యనారాయణ, వెంకటేశ్వరరావులను సన్మానం చేశారు. అనంతరం గ్రామంలో కెపిఐ ప్రకృతి వ్యవసాయ స్లోగన్స్ ర్యాలీ నిర్వహించారు. మిస్సస్ మాజీ వైస్ చైర్మన్ రామాంజనేయులు, గుంపర్రు నీటి సంఘం అధ్యక్షులు జల్లు రాజేశ్, కూటమి నాయకులు జల్లు రామకృష్ణ, చేగొండి వెంకటేశ్వరరావు, జల్లు శ్రీనివాసరావు, జల్లు మణిశంకర్ పాల్గొన్నారు.

అభివృద్ధికి స్ఫూర్తి ప్రదాత వెంకటరత్నం

వర్ధంతిలో ఎంఎల్‌ఎ రాధాకృష్ణ

తణుకు రూరల్ : మాజీ ఎంపిపి, మాజీ సర్పంచి ఆరిమిల్లి వెంకటరత్నం స్ఫూర్తితో తణుకు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు తన వంతు కృషిచేస్తానని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. మండలంలో అభివృద్ధి ప్రదాతగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతోందన్నారు. తణుకు మండల పరిషత్ మాజీ అధ్యక్షులు, వేల్పూరు గ్రామ మాజీ సర్పంచి ఆరిమిల్లి వెంకటరత్నం పదో వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఎల్‌ఎ మాట్లాడుతూ వేల్పూరు గ్రామంలో యువకుడిగా రైతులను సమీకరించి నూతన పద్ధతులను అవలంబించి, వారిలో ఒక పెద్దగా వెంకటరత్నం ఉండేవారని గుర్తుచేశారు. గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి సుమారు 18 సంవత్సరాల పాటు సర్పంచిగా పనిచేసిన ఆయన సమగ్రంగా అభివృద్ధి చేసి గ్రామానికి అనేక పర్యాయాలు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గ్రామానికి గుర్తింపు తీసుకువచ్చారని చెప్పారు. అనంతరం ఎంఎల్‌ఎ రాధాకృష్ణ పేదలకు దుస్తులు, పండ్లు అందజేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేల్పూరు గ్రామ ప్రజలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి సహకార సంఘాల తోడ్పాటు

జిల్లా సహకార అధికారి ఎన్.నాగరాజు

పాలకోడేరు : మహిళల అభివృద్ధికి సహకార సంఘాలు తోడ్పాటు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా సహకార అధికారి ఎన్.నాగరాజు అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పాలకోడేరు మండల సమాఖ్య కార్యాలయంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పళ్లం అరుణకుమారి అధ్యక్షతన జరిగిన జిల్లా సమాఖ్య సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సహకార సంఘానికి అధ్యక్షులుగా జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారని అన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణ మహిళలు అంతా వినియోగించుకోవాలని కోరారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పళ్లం అరుణకుమారి, గ్రామ సహకార యూనియన్ విద్యాధికారి భోజ రంగారావు, మండల సమైక్య అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

100 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

పాలకొల్లు : పాలకొల్లు 13వ వార్డు అల్లు వెంకట సత్యనారాయణ స్కూల్ వద్ద మంత్రి నిమ్మల రామానాయుడు మంజూరు చేసిన 100 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కూటమి నాయకులు శుక్రవారం కలిసి ప్రారంభించారు. దీర్ఘకాలికంగా ఈ ప్రాంత వాసులు విద్యుత్ బాధలు అనుభవిస్తున్నారు. ప్రజాదర్బార్‌లో వారు వోల్టేజ్ సమస్యను తెలిపారు. తమ సమస్యను తీర్చమని గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు చెప్పినా తిరిగినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమ సమస్యను మంత్రి రామానాయుడు దృష్టికి కాలనీ వాసులు తీసుకువెళ్లారు. ఆయన స్పందించి విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలు ఇవ్వగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఈ కాలనీవాసులు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు చేశారు. పాలకొల్లు ఎడిఇ రామకృష్ణ, ఎఇ సల్లీ, కూటమి నాయకులు గండేటి వెంకటేశ్వరరావు, కర్నేన గౌరు నాయుడు, మద్దాల అయ్యప్ప పాల్గొన్నారు.

సమరసత సేవా ఫౌండేషన్ కార్యక్రమాలు విస్తరించాలి

పెనుమంట్ర : జిల్లా బాల వికాస కేంద్రాలలో సమరసత సేవా ఫౌండేషన్ కార్యక్రమాలు విస్తరించవలసిన అవసరం ఉందని దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి గణేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని మార్టేరు గ్రామంలోని గౌరీ శంకర దేవాంగ కళ్యాణ మండపంలో జరిగిన బాలవికాస కేంద్రాల వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాలల కార్యక్రమాలు తిలకించి ప్రశంసించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ విభాగం కోసం సెల్: 94900 99180
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ విభాగం కోసం సెల్: 83339 88814

దేశ ఐక్యత, సమగ్రత కాపాడాలి

పహల్గాం ఘటనను నిరసిస్తూ పలుచోట్ల నిరసన



భీమవరం : కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఆకివీడు : కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - భీమవరం

దేశ ఐక్యత సమగ్రతను కాపాడాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం అన్నారు. కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ యుటిఎఫ్ జిల్లా కార్యాలయం నుంచి ప్రకాశం చౌక్ వరకు క్యాండిల్ ర్యాలీ శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నేతలు ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమాయక పౌరుల జీవితాలపై అమానవీయ దాడి మాత్రమే కాదని, మతపరమైన ప్రాతిపదికన, మానవాళినే లక్ష్యంగా చేసుకుని క్రూరమైన హత్య అన్నారు. విహారయాత్రికులపై మత ప్రాతిపదికన గుర్తించి వారిని హింసించడం నాగరికత విలువలపై ప్రత్యక్ష దాడి అన్నారు. మతం పేరుతో జరుగుతున్న హత్యలు మానవాళి చరిత్రకే మాయని మచ్చ అన్నారు. మృతులకు నివాళులు అర్పిస్తూ వారి కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు రామకృష్ణ ప్రసాద్, కుమార్ బాబ్జీ, రామకృష్ణంరాజు, యేసు బాబు, రాష్ట్ర కౌన్సిలర్ రామానుజరావు, జెవివి అధ్యక్షులు ప్రసాద్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసాపురం : పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో మరణించిన వారికి సంఘీభావంగా సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక పంజా సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు. మృతులకు నివాళులర్పించారు. ఉగ్రవాదం నశించాలి, ముష్కరులను కఠినంగా శిక్షించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, ముస్లిం పెద్దలు ఎండి అజారుద్దీన్ పాషా మాట్లాడారు. ఎండి అజిజి చిటి హుస్సేన్, గౌస్ ఇమ్రాన్ ఖాన్, సిపిఎం మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు, కమిటీ సభ్యులు తెలగంశెట్టి సత్యనారాయణ, పట్టణ కమిటీ సభ్యులు బూడిద జోగేశ్వరరావు, పొగాకు నారాయణరావు, పొన్నాడ మల్లేష్, చింతపల్లి గంగయ్య పాల్గొన్నారు.

జనసేన అధిష్టానం పిలుపు మేరకు నరసాపురం అంబేద్కర్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మానవహారంలో మాజీ మంత్రి, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పాల్గొన్నారు.

అంజుమాన్ కమిటీ ఆధ్వర్యంలో నరసాపురంలో సానుభూతి తెలిపారు. పంజా సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు.

ఆకివీడు : పహల్గాం ఉగ్రదాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని సిపిఎం ఏరియా కార్యదర్శి కె.తవిటినాయుడు అన్నారు. కాశ్మీర్లో ఉగ్రదాడి నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ముస్లిం అసోసియేషన్ సభ్యులు జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక సిపిఎం కార్యాలయం నుంచి మహాత్మా గాంధీ విగ్రహం మీదుగా జాతీయ రహదారిపై రెండు కిలోమీటర్లు శాంతి ర్యాలీ నిర్వహించి స్థానిక ముస్లిం వీధి వద్ద బహిరంగ సభ నిర్వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని, ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్యకు తాము సంపూర్ణ మద్దతుని ప్రకటిస్తున్నామని అన్నారు. ముస్లిం అసోసియేషన్ కార్యదర్శి ప్రముఖ వైద్యులు డాక్టర్ బిలాల్ మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు షేక్ వలి, డోకల లక్ష్మి, బి.రాంబాబు, ఎస్.సూరిబాబు, షేక్ బాజీ మాట్లాడారు. **పెనుగొండ రూరల్ :** పహల్గాం మారణ హోమంలో అశువులు బాసిన భారతీయుల మృతికి పెనుగొండ మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది, కార్యదర్శులు సంతాపం వ్యక్తం చేసి నివాళులు అర్పించారు. ఎండిఒ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. **తాడేపల్లిగూడెం :** పెహల్గాంలో టెర్రరిస్టుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి శుక్రవారం బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకు చీఫ్ మేనేజర్ పిపిఎన్ఆర్.బాబు, యూనియన్ సీనియర్ నాయకులు ఎస్ఎస్.ప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ స్రవంతి, జి.ప్రకాష్, బి.ఏడుకొండలు జోహారులర్పిస్తూ మౌనం వహించారు. ఉగ్రవాదుల దాడులను ఖండించాలని యూనియన్ ఎపి, తెలంగాణ రాష్ట్రాల కార్యదర్శి టివి.సూర్యనారాయణ పేర్కొన్నారు. బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

గణపవరం : భారతదేశ ఐక్యత వర్ధిల్లాలని హిందుస్తాన్ జిందాబాద్ పాకిస్థాన్ ముర్దాబాద్ నినాదాలు చేస్తూ శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్ సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడి భారతదేశాన్ని కాపాడాలని, హిందు ముస్లిం బాయ్ బాయ్‌గా ఉండాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గణపవరం మసీదు పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ఉండి: పహల్గాం ఉగ్రదాడి ప్రతి ఒక్కరిని కలచివేసిందని ఉండి ఎఎంసి చైర్మన్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు అన్నారు. ఉండి మెయిన్ సెంటర్‌లో శుక్రవారం సాయంత్రం జుత్తిగ నాగరాజు ఆధ్వర్యంలో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎడవెల్లి వెంకటేశ్వరరావు, ఆకివీడు మండల అధ్యక్షులు అల్లాడి శివన్నారాయణ, కాళ్ల మండల అధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు, పాలకోడేరు మండల అధ్యక్షులు గాదం నానాజీ, కుచ్చు శివకృష్ణ, యర్రా రవి, అడపా గణేష్, షేక్ నదీమ్ నివాళులర్పించారు.

భీమవరం టౌన్ : పహల్గాం ప్రాంతంలో ఇటీవల జరిగిన భయానక ఉగ్రదాడిని ఖండిస్తున్నామని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ(పిఎసి) చైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం ప్రకాశం చౌక్‌లో శుక్రవారం కూటమి నాయకుల అధ్వర్యంలో శాంతియుత క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు పాల్గొన్నారు.

పెనుమంట్ర : మార్టేరు సెంటర్లో పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ శుక్రవారం రాత్రి జనసేన ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో టిడిపి నాయకులు పితాని వెంకట్, శ్రీనివాస రెడ్డి, బాలాజీ రెడ్డి, వనకుమార్, జనసేన మండల శాఖ అధ్యక్షులు కోయ వెంకట కార్తీక్, బయ్యే బాలాజీ, అలీ పాల్గొన్నారు.

కొనసాగిన భోజన శిబిరం

ఎఎస్ఆర్ నగరవాసులకు తాడేపల్లిగూడెం ఉల్లిపాయల మార్కెట్ జట్టు సహకారం

పాలకోడేరు : పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్ వాసులకు సిపిఎం ఆధ్వర్యంలో ప్రారంభించిన భోజన శిబిరం మూడో రోజు కూడా కొనసాగింది. తాడేపల్లిగూడెం ఉల్లిపాయల మార్కెట్ జట్టు భోజనం శిబిరానికి సహకారం అందించింది. ఉల్లిపాయలు, బంగాళదుంపలు, బియ్యాన్ని, ఉల్లిపాయలను మార్కెట్ జట్టు అధ్యక్షులు చందర్రావు, ఉపాధ్యక్షులు సుబ్బారావు, సభ్యులు నాగేశ్వరరావు, కోటి అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి శేషాపు ఆశ్రియ్య మాట్లాడుతూ నిరుపేదల ఇల్లు అన్యాయంగా కొల్లగొట్టడంతో ఇక్కడే శిబిరాలు మధ్య జీవనం సాగిస్తున్నారని, పేదలకు అండగా సిపిఎం భోజన శిబిరాన్ని ఏర్పాటు చేసి భోజనాన్ని అందజేస్తుందని తెలిపారు. దీనికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు.

లక్ష్య సాధనకు అధికారులు కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

భీమవరం : నిర్దేశించిన లక్ష్యాల సాధనకు అధికారులు మరింత కృషిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ నాగరాణి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వర్క్ ఫ్రం హోం, ఇకెవైసి, ఆధార్ నమోదు, మిస్సింగ్ సిటిజన్స్, మనమిత్ర అంశాలపై గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. లక్ష్య సాధనకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంటి పన్ను వసూళ్ల వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఒడిఎఫ్ ప్లస్ మోడల్ విలేజెస్ ప్రకటన లక్ష్యసాధనకు అధికారులు ప్రణాళికాబద్ధంగా కృషిచేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, డిఇఒ ఇ.నారాయణ, డిపిఒ బి.అరుణశ్రీ పాల్గొన్నారు.

పోలియోను నిర్మూలించాలి

రోటరీ డిస్ట్రిక్టు గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు

తణుకు : పోలియోను మొత్తం ప్రపంచంలోనే నిర్మూలించాలని అందుకు అందరూ సన్నద్ధం కావాలని రోటరీ డిస్ట్రిక్టు గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు కోరారు. శుక్రవారం ఆయన అధికారికంగా తణుకు క్లబ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా తణుకు జిల్లా ఆసుపత్రిలో ఉన్న డయాలసిస్ సెంటర్‌కు వైద్య సేవలకు వచ్చే రోగుల ఉపయోగార్థం 10 కుర్చీలను బహూకరించారు. 20 మంది రిక్షా కార్మికులకు రిక్షా బాడీ టాప్స్‌ను అందజేశారు. అనంతరం రోటరీ క్లబ్‌లో అధ్యక్షులు ఆనందం మస్తాన్‌రావు(బాబీ) అధ్యక్షతన సమావేశం జరిగింది. తొలుత పాల్‌హారిస్, మేడమ్ గోల్డింగ్, ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు తోట దీపాదేవి, మలకలపల్లి లక్ష్మీలకు నేషన్ బిల్డర్ అవార్డును గవర్నర్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం రోటరీ డిస్ట్రిక్టు గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావుని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కలగర వెంకటకృష్ణ, గమిని రవికృష్ణ, ఎం.సత్యనారాయణరెడ్డి, లహరి, కె.సత్యనారాయణరాజు, పోతుల శ్రీనివాస్, కామారెడ్డి, వి.పార్వతి, డాక్టర్ వెంకటరాజు, సిద్ధార్థ పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమానికి కృషి : కలెక్టర్

భీమవరం : వికలాంగుల సంక్షేమానికి కృషి చేయడంతో పాటు వారి హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లా కలెక్టర్ నాగరాణి అధ్యక్షతన వికలాంగుల హక్కుల చట్టం-2016 అనుబంధం మార్గదర్శకాలు - 2023 అమలుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులు, అసోసియేషన్ల ప్రతినిధులతో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ చట్టం అమలుపై జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. చట్టం అవగాహనకు 15 రోజుల్లో జిల్లా అధికారులకు ఒక వర్క్‌షాప్‌ను నిర్వహించాలని డిఆర్‌ఒకు సూచించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లో వికలాంగుల చట్టం సెక్షన్-92 అవగాహనపై సమాచారంతో గోడ పత్రికలను తయారు చేసి ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని అడిషనల్ ఎస్‌పికి సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మొగలి వెంకటేశ్వర్లు, వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రాజ్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి.గీతాబాయి, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, డిపిఒ బి.అరుణశ్రీ, డిసిహెచ్ఎస్ పి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేడు 'కథా కుసుమాలు' పుస్తకావిష్కరణ

నరసాపురం : జిల్లాకు చెందిన రచయితల కథల సంకలనం 'కథా కుసుమాలు' పుస్తకావిష్కరణ ఈనెల 26 శనివారం ఉదయం నరసాపురం గోదావరి గట్టున ఉన్న ఎస్ఆర్ సాంస్కృతిక కేంద్రంలో జరుగుతుందని పుస్తక రూపకర్త ప్రముఖ రచయిత పాలకోడేటి సత్యనారాయణ రావు ఒక ప్రకటనలో తెలిపారు. రెండు సంవత్సరాల కిందట ఈ రచయితలు రాసిన కథలతో 'కథా కిరణాలు' అనే సంకలనం కూడా ఇక్కడే ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఈ పుస్తకంతో పాటు మరికొందరు రాసిన పుస్తకాలు ఆవిష్కరించారు. ప్రముఖ రచయితలు డాక్టర్ సుగుణరావు, వల్లీశ్వర్ పాల్గొన్నారు.

చెత్త డంపింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించాలి

సిపిఎం ఆధ్వర్యాన డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి



వినతి అందజేస్తున్న నాయకులు

తణుకు రూరల్ : వేల్పూరు గ్రామంలో డంపింగ్ యార్డ్‌కు అవసరమైన ప్రత్యేక స్థలం కేటాయించాలని సిపిఎం వేల్పూరు గ్రామ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తణుకు డిప్యూటీ తహశీల్దార్ ఎస్.శ్రీదేవికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు మాట్లాడుతూ మండలంలో ఎక్కువ జనాభా కలిగిన వేల్పూరు గ్రామం దినదినాభివృద్ధి చెందుతూ మరింత విస్తరిస్తోందని, కాని దానికి అనుగుణంగా సౌకర్యాల కల్పన ఉండటం లేదన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులు పోగేసిన చెత్త డంప్ చేసేందుకు అవసరమైన ప్రత్యేక స్థలం లేక పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికి తిరిగి సేకరించిన చెత్తని గ్రామ సరిహద్దులో ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న గోస్తని కాలువ గట్టుపై డంపింగ్ చేస్తున్నారన్నారు. దీంతో వర్షాకాలంలో చెత్త తడిసి తీవ్ర దుర్గంధం వస్తుందని ఆయన వివరించారు. డంపింగ్ చేసిన చెత్తను తగలబెట్టడం ద్వారా విపరీతంగా దుర్వాసన, పొగతో ఆ రహదారి వాహనదారులు, సమీపంలో ఉంటున్న చిరు వ్యాపారులు అవస్థలు పడుతున్నారని వాపోయారు. ఈ ప్రభావంతో ఊపిరితిత్తులు వంటి శ్వాసకోశ సమస్యలతో చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆయన వివరించారు. ప్రభుత్వాలు ఇస్తున్న సంపూర్ణ పారిశుద్ధ్యం స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర వంటి నినాదాలు కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితం అవుతున్నాయి తప్ప అంతగా ఫలితాలు కనిపించడం లేదని వీరభద్ర రావు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి చిత్తశుద్ధితో కృషిచేసి డంపింగ్ యార్డ్‌కు స్థలం కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ శాఖ కార్యదర్శి వాసా వెంకటేశ్వరరావు, అంబటి రామకృష్ణ, కె.వీరభద్రరావు పాల్గొన్నారు.

షాపు అద్దెలు తగ్గించకపోతే ఆత్మహత్యలే!

మున్సిపల్ షాపు లీజుదారులు

తాడేపల్లిగూడెం : పెంచిన షాపుల అద్దెలు తగ్గించకపోతే ఆత్మహత్యలకైనా సిద్ధపడతామని మున్సిపల్ షాప్ లీజుదారులు హెచ్చరించారు. శుక్రవారం షాపులను మూసివేసి స్థానిక కృష్ణ బాలాజీ సెంటర్ నుంచి ఎన్‌టిఆర్ చౌక్, మున్సిపల్ కార్యాలయం వరకు షాపు లీజుదారులు శాంతియుత ర్యాలీగా వెళ్లి మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లీజుదారులు మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతూ మాకు ఎటువంటి నోటీసులు లేకుండా అద్దెలు పెంచడం దారుణమన్నారు. కొన్ని సంవత్సరాలుగా మున్సిపాలిటీ షాపులు లీజుకు తీసుకొని జీవనం సాగిస్తూ మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరిస్తూ వచ్చామని, 3,500 ఉన్న షాపు అద్దెను ఒక్కసారిగా 10 వేలకు పెంచడంపై లీజు దారులు ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో ఉన్నామని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పులు దొరకక, వ్యాపారాలు లేక సతమతమవుతున్నామని, ఇలాంటి సమయంలో అధికంగా పెంచిన లీజును కట్టాలని నోటీసులు ఇవ్వడంపై అధికారులు కనికరించాలని లీజదారులు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ఈ విషయమై పైఅధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు. తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌కి ఇదే విషయంపై వినతి పత్రం అందజేయగా ఎంఎల్‌ఎ సానుకూలంగా స్పందించారని మున్సిపల్ షాపు లీజుదారుల జెఎసి తెలిపారు.

పెన్నాడ అగ్రహారం అభివృద్ధికి కృషి

డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు

రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ

పాలకోడేరు : పెన్నాడ అగ్రహారం గ్రామాభివృద్ధికి తన వంతు కృషిచేస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. పెన్నాడలో ప్రభుత్వ నిధులు, దాతల సహకారం రూ.70 లక్షలతో నిర్మించిన బిసి కల్యాణ మండపం, రూ.20 లక్షలతో నిర్మించిన సిమెంట్ రహదారులు, రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. జూన గ్రామంలో తాగునీరు సమస్యను పరిష్కరిస్తామని, కలుషితం లేని స్వచ్ఛమైన నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో పంచాయతీకి చెందిన చెరువు, దేవస్థానం భూములు ఆక్రమణలకు గురయ్యాయని గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకురాగా సత్వరమే చర్యలు తీసుకుంటామని, ఆక్రమణదారుల కబంధహస్తం నుంచి విముక్తి కల్పిస్తామని అన్నారు. పెన్నాడ బిసి కమ్యూనిటీ భవనాన్ని మిగతా గ్రామాలవారు స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. కేవలం ప్రభుత్వం రూ.5 లక్షలు ఇస్తే, దాతలు రూ.65 ఖర్చులు సమకూర్చి భవనం నిర్మాణం పూర్తిచేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చిల్లా అనూష, ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు, తూర్పుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామారావు, పెన్నాడ సంఘం నాయకులు సత్యనారాయణ, చిదగం శ్రీనివాస్, టిడిపి నాయకులు చేబోలు రామకృష్ణ, సర్పంచులు వంశీకృష్ణంరాజు, బొల్లా శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

మలేరియా అంతం మనతోనే : మలేరియా అధికారి

తాడేపల్లిగూడెం : ప్రజలందరిలో మార్పు వస్తే మలేరియా అంతమవుతుందని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా తాడేపల్లిగూడెం పట్టణ ఆరోగ్య కేంద్రాల వద్ద ప్రపంచ మలేరియా దినోత్సవంపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. వారానికి ఒక రోజు శుక్రవారం ఫ్రైడే డ్రై డే పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు మంగతుయారు, పద్మ, ఆరోగ్య సహాయకులు ఇ.కాంతారావు, అంగన్వాడీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

గణపవరం: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం గణపవరం పిహెచ్‌సి సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ పి.కిరణ్మయి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మలేరియా, డెంగీ, ఫైలేరియా వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించాలన్నారు. ఈ ర్యాలీలో సిహెచ్.సత్యవతి, హెచ్‌వి.పద్మజ, ఆరోగ్య కార్యకర్తలు, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు. **ఉండి :** మలేరియా నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉండి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ పి.లక్ష్మీ సునంద అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఉండి, యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మలేరియా దినోత్సవంపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.లక్ష్మి సునంద, డాక్టర్ బిన్నీ శామ్యూల్ మాట్లాడుతూ మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉండి సిహెచ్‌ఒ ఆర్.కృష్ణకుమార్, యండగండి సిహెచ్‌ఒ రత్నరాజు, సిబ్బంది, ఎఎన్ఎంలు, ఎంఎల్ హెచ్‌పిలు, ఆశాలు పాల్గొన్నారు.

ప్రజా వినతుల స్వీకరణ

నరసాపురం : పట్టణంలోని జనసేన కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేసి నియోజకవర్గ వ్యాప్తంగా వచ్చిన ప్రజల నుంచి సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, నరసాపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు కలిసి పాల్గొన్నారు. పెరుగుతున్న ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకోవడం, వాటిని తక్షణం పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడం లక్ష్యంగా ఈ వేదిక ఏర్పాటుచేయబడిందని వారు తెలిపారు.

సంపత్‌కు రిటైర్డ్ ఉద్యోగుల అభినందన

భీమవరం : జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కార్యాలయంలో అకౌంట్స్ అధికారిగా విధులలో చేరిన డిజె సంపత్‌ను జిల్లా రిటైర్డ్ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. సంఘం అధ్యక్షులు గాతల జేమ్స్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎస్ఎన్.రాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ చాన్ బాషా, ఉమ్మడి జిల్లా ట్రెజరీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు యువి.పాండు రంగారావు అభినందించి ఆర్థిక శుభాకాంక్షలు తెలియజేశారు.

రైతులకు ముందస్తు సమాచారమివ్వాలి

మొగల్తూరు : రైతులకు ముందస్తుగా సమాచారం అందించి సర్వే చేయాలని ఆర్‌డిఒ దాసిరాజు సిబ్బందికి సూచించారు. మండలంలోని కేపీ పాలెం నార్త్‌లో శుక్రవారం రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ఖచ్చితంగా సర్వే నిర్వహించాలన్నారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు వినతులు అందించారు. సర్పంచి కడలి సోంబాబు, తహశీల్దార్ కె.రాజకిశోర్, సర్వేర్ ధనరాజు, సిబ్బంది ఉన్నారు.

ప్రజా సమస్యలు తీర్చడమే బాధ్యత : ఎంఎల్‌ఎ

తాడేపల్లిగూడెం : ఏ గ్రామంలో ఏ సమస్య ఉన్న అది పరిష్కరించేంత వరకు విశ్రమించేది లేదని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని నందమూరి గ్రామంలో త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎడిఎ రామకృష్ణ, ఎఇ రామకృష్ణ, కూటమి నాయకులు సెనగల రాంబాబు, దార్లంక రాము, మాజీ సర్పంచి వేమన సత్యనారాయణ పాల్గొన్నారు.

స్వాజ్ దరఖాస్తుల స్వీకరణ : ఎంపిడిఒ

గణపవరం : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని సచివాలయాల్లో స్వాజ్ దరఖాస్తులు చేసుకోవాలని గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఇప్పటి వరకు భర్త చనిపోయిన మహిళలకు 132 మందికి పింఛన్లు ఇస్తున్నట్లు చెప్పారు. అర్హులు ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్ కార్డు వివరాలతో కూడిన పత్రాలు సచివాలయాల్లో అందజేయాలని కోరారు.

కమిషనర్‌కు సన్మానం

తాడేపల్లిగూడెం : 2024-25 ఆర్థిక సంవత్సరానకు ఆంధ్రప్రదేశ్ 123 మున్సిపాలిటీలలో రాష్ట్రవ్యాప్తంగా తాడేపల్లిగూడెం పురపాలక సంఘం ఇంటిపన్ను వసూళ్లలో మూడో స్థానం సంపాదించిన సందర్భంగా తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబును సన్మానించారు. శుక్రవారం జరిగిన సమీక్షా సమావేశంలో రీజనల్ డైరెక్టర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సిహెచ్.నాగ నరసింహారావు(రాజమండ్రి) చేతుల మీదుగా సత్కరించి, నగదు బహుమతి రూ.3 వేలు మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు.

CHANGE OF NAME

I, **BOKKA DURGA DEVI,** W/o Bokka Srinivas, D.No.6-126, Mandapaka, Tanuku, W.G.Dt. A.P.

I changed my name from **BOKHA DURGA DEVI SRINIVAS** (Old Name) to **BOKKA DURGA DEVI** (New Name). Hence forth i am being called **BOKKA DURGA DEVI** W/o Bokka Srinivas for all purposes

CHANGE OF NAME

I, **BOKKA SRINIVAS,** S/o Bokka Satyanarayana, D.No.216, gandhidham, kutch Dt, guajrat.

I changed my name from **BOKHA SRINIVAS SATYANARAYANA** (Old Name) to **BOKKA SRINIVAS** (New Name). Hence forth i am being called **BOKKA SRINIVAS** S/o Bokka Satyanarayana for all purposes

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, ఇరగవరం మండలం, సూరంపూడి గ్రామానికి చెందిన బొల్లా సత్యవాణి అను నా యొక్క **పాస్‌పోర్టు నెంబర్ : S1587399** గల పాస్‌పోర్టు తణుకు నుండి సూరంపూడి వెళ్ళుతుండగా మార్గమధ్యలో పడిపోయింది. చుట్టు ప్రక్కల ఎంత వెతికినను దొరకలేదు. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు.

బొల్లా సత్యవాణి
D/o. వీరాస్వామి
డోరు నెం. 2-30, సూరంపూడి
ఇరగవరం మండలం, ప॥గో॥ జిల్లా,
సెల్ నెం: 87907 51712

భీమవరం పురపాలక సంఘం

ఆర్.ఓ.సి. నెం. 12(1744533)/2019/డి.బి ది.24-04-2025

ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు

భీమవరం పురపాలక సంఘ పట్టణ పరిధి పురపాలక సంఘములో షార్టు టెండరు నోటీసు నెం.03(1) /BHI/BPS/LRS//2025-26/E1 & షార్ట్ టెండరు నోటీసు నెం.03 (2-6) BHI/General/2025-26/E1 లోని జనరల్ నిధుల నుండి 5 పనులకు గాను రూ. 134.40 లక్షలు, మరియు BPS LRS నిధుల నుండి 1 పనికి గాను రూ. 5.00 లక్షతో, ఇ-ప్రొక్యురుమెంటు ద్వారా టెండర్లు జి.వో.ఎమ్.ఎస్ నెం: 94 లేక దానిపై ఇతర అనుబంధ జి.వోల ప్రకారం రిజిష్టరు కాంట్రాక్టర్ల నుండి కోరబడుచున్నవి. మిగిలిన వివరములు ఇ-ప్రొక్యురుమెంటు మార్కెట్టు www.tender.apeprocurement.gov.in లేదా కమీషనరు, భీమవరం పురపాలక సంఘము, ప॥గో॥జిల్లా (సెల్: 9849906540, 9849906543 వారిని సంప్రదించగలరు.

కమీషనరు,
భీమవరం పురపాలక సంఘం